ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 09.03.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. పెరుగుతున్న సాంకేతికత నేపథ్యంలో కొత్త తరహా నేరాలు పెరగకుండా సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను కోరారు.

2. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

3. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రాహుల్ బంధు' అనే కొత్త పథకాన్ని అమలు చేస్తున్నారని బీఆర్ఎస్ కార్యానిర్వాహక అధ్యక్షుడు. కె. తారక రామారావు విమర్శించారు.

4. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" కార్యక్రమంలో భాగంగా యువ సంఘం ఆరో దశకు ఆన్ లైన్ నమోదు కోసం ప్రత్యేక పోర్టల్ ను ప్రారంభించింది.

--------------------------

**ముఖ్యమంత్రి**

పెరుగుతున్న సాంకేతికత నేపథ్యంలో కొత్త తరహా నేరాలు పెరగకుండా సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో జరుగుతున్న పోలీస్ ఆఫీసర్స్ రీ ట్రీట్ 2026 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విభాగాల వారిగా వివిధ అంశాలను ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించారు. భవిష్యత్

లో పోలీసింగ్ లో తసుకురావాల్సిన మార్పులు ప్రభుత్వం తీసుకోవల్సిన చర్యల ఆవశ్యకతను అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ....నేరాలను నిరోధించడానికి నేరస్తులను త్వరగా గుర్తించడానికి ఏఐ టెక్నాలజీని వినియోగించాలని సూచించారు. విద్యా సంస్థల్లో డ్రగ్స్ బాధితులను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చేలా కౌన్సిలర్లను నియమించుకోవాలని అన్నారు.

**డెస్క్**

----------------------

**రేవంత్ రెడ్డి సమీక్ష**

ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రంలో అన్ని సౌకర్యాలతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ రోజు క్రీడాశాఖపై నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియంను పునరుద్ధరించడంతోపాటు, ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఆ డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఒలంపిక్స్, కామన్ వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా, ఒలంపిక్స్ లో తెలంగాణ క్రీడాకారుల సత్తా చాటడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**డెస్క్**

------------------------------

**పొన్నం ప్రభాకర్**

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని బాగా చదవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈరోజ హుస్నాబాద్ లోని బాలికల గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం సమయంలో మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ లో ఉన్న వివరాలు, విద్యార్థినులకు వడ్డిస్తున్న వంటకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని.. ఆహారం విషయంలో రాజీ లేదని ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన మెను ప్రకారం  విద్యార్థులకు ఆహారం అందించాలని సూచించారు.

**పీటీసీ - సిద్దిపేట**

------------------------------

**కొండ సురేఖ**

హైదరాబాద్ వనస్థలిపురంలోని హరిణ వనస్థలి పార్క్ లో అనన్య రిసార్ట్ ను అటవీశాఖ మంత్రి కొండ సురేఖ ఆకస్మిత తనిఖీ చేశారు. రిసార్ట్ నిర్వహణపై కనీస వసతులు కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రిసార్ట్ నిర్వహణను పదేళ్లుగా ఓ ప్రైవేట్ సంస్థ లీజ్ కు తీసుకుంది. రెండు నెలల్లో దీనిని ప్రయివేట్ వ్యక్తుల నుండి స్వాధీనం చేసుకొని అటవీ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తామని కొండాసురేఖ తెలియజేశారు.

**డెస్క్**

---------------------------

**ఫైర్ కోర్స్**

తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ, సివిల్ డిఫెన్స్ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సైఫాబాద్ పీజీ కాలేజీలో ఈరోజు “సివిల్ డిఫెన్స్ వాలంటీర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్” అనే

కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జి.వి. నారాయణ రావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఈరోజు నుంచి ఈనెల 15వ తేదీ వరకు ఏడు రోజుల పాటు జరుగుతుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ నారాయణ రావు మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితులు, ముఖ్యంగా ఎయిర్ రైడ్స్, కెమికల్ దాడులు, న్యూక్లియర్ ప్రమాదాలు, ఇతర విపత్తుల సమయంలో శిక్షణ పొందిన వాలంటీర్లు ప్రభుత్వ శాఖలకు సహకరిస్తారని చెప్పారు. ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ కరుణ సాగర్, ఫైర్ విభాగానికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

డెస్క్

----------------------------

**ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్**

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" కార్యక్రమంలో భాగంగా యువ సంగమ్ ఆరో దశకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ప్రారంభించింది. మార్చి 2 వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు అందుబాటులో ఉన్నాయి. 18 నుంచి 30 సంవత్సరాల వయసు గల విద్యార్థులు, NSS, NYKS వాలంటీర్లు, యువ వృత్తినిపుణులు AICTE వెబ్ సైట్ లో గానీ, ఏక్ భారత్ వెబ్ సైట్ లోగానీ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కార్యక్రమంలో ఎంపికైన అభ్యర్థులు వేరే రాష్ట్రాలకు 5 నుంచి 7 రోజుల విద్యా, సాంస్కృతిక యాత్రలు చేస్తారు. ఐదు ప్రధాన ఇతివృత్తాలతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ దశలో దేశవ్యాప్తంగా 22 నోడల్ ఉన్నత విద్యాసంస్థలు కార్యక్రమానికి నేతృత్వం వహిస్తాయి. గతంలో జరిగిన అయిదో దశలో 46వేల కన్నా ఎక్కువ రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. వివిధ రాష్ట్రాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యా మంత్రిత్వ శాఖ కోరింది.

డెస్క్

----------------------------

**ఇంటర్ మీడియట్**

ఈరోజు జరిగిన ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం ఫిజిక్స్, ఎకనమిక్స్ పరీక్షలకు 96.44 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఒక ప్రటకనలో తెలియజేశారు. మొత్తం 5లక్షల 36వేల 804 మంది విద్యార్థులకు గానూ.. 5 లక్షల 16వేల 740 మంది విద్యార్థులు ఈరోజు పరీక్ష రాసినట్లు వెల్లడించారు. 19వేల 64 మంది పరీక్ష రాయలేదన్నారు. కాగా.. ఈరోజు వరంగల్, ఖమ్మం, యాదాద్రి, పెద్దపల్లి జిల్లాల్లో ఒక్కోటి చొప్పున మొత్తం 4 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. ఈరోజు పరీక్ష కోసం సెట్ సి ప్రశ్నా పత్రం ఎంపిక చేశారు.

**జీఎస్**

---------------------------

**కేటీఆర్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రాహుల్ బంధు' అనే కొత్త పథకాన్ని అమలు చేస్తున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు. కె. తారక రామారావు విమర్శించారు. సిరిసిల్లలో కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్ల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.... రైతు బంధు పథకాన్ని అమలు చేయకుండా సంవత్సరానికి వెయ్యి కోట్ల రూపాయలు రాహుల్ గాంధీకి ఇచ్చే రాహుల్ బంధు పథకం మాత్రం తెలంగాణలో పక్కగా రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

----------------------------------

**బీఆర్ఎస్ ఎస్ సీఆర్ జీఎం**

కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు డిమాండ్‌పై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో ఈరోజు సమావేశం అయింది. మాజీ ఎంపీ బి వినోద్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో 40 ఏళ్లుగా కొనసాగుతున్న కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్‌ను నాయకులు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రప్రభుత్వం తాజాగా మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌కు అంగీకరించిందని, ప్రైవేట్ సంస్థలు పనులు చేస్తున్నాయని

జీఎం తెలిపారు. కాజీపేట రైల్వే డివిజన్ డిమాండ్‌ను రైల్వే బోర్డు దృష్టికి తీసుకెళ్తామని జీఎం హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ బాబు మాట్లాడుతూ, అయోధ్యపురంలో భూములు కోల్పోయిన రైతులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లాతూర్ తరహాలో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

**జీఎస్**

------------------------

**స్వీకారం**

గిరిజన సంక్షేమశాఖ నూతన సంచాలకులుగా సంతోష్ బి.ఎం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ లోని మాసబ్ ట్యాంక్ లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు.

**డెస్క్**

--------------------------